సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 14 । డిసెంబర్ । 2023



బతుకు భరోసా..

మహిళలు, యువత సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. వివిధ పథకాలతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. -IIలో



నేతన్నకు ప్రభుత్వం ఊతం

రాష్ట్రంలో దగా పడిన చేనేత కార్మికులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుం దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. -IIలో



రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయుల ప్రతిభ -IIలో

తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో నూతనంగా నియామకాలు

పార్వతీపురంటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సంస్థాగతంగా నూతన నియామకాలను కొనసాగిస్తోంది. అందులో భాగంగా పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన నియామకాలకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగం జోనల్ (విజయనగరం, విశాఖపట్టణం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) ఇన్‌చార్జిగా జానకి రావు రెల్లను నియమించారు. జోనల్ (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం) ఇన్‌చార్జ్‌గా బడ్డాడి ఫణికుమార్, కార్యదర్శిగా కొండగొర్రి భాస్కరరావు (పార్వతీపురం మన్యం) సంయుక్త కార్యదర్శిగా బొన్నాడ శివకుమార్‌కు (పార్వతీపురం మన్యం)బాధ్యతలు అప్పగించారు. 2024వ సంవత్సరంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విద్యార్థి విభాగం ప్రజల్లో చైతన్యం కల్పించి పార్టీని విజయ పథంలో నడిపించే దిశగా నియామకాలు చేపట్టారు.

జయితి ఆలయంలో జెడ్పీచైర్మన్ పూజలు



కుమార్తెతో కలిసి మల్లిఖార్జున స్వామికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెంటాడ: మండలంలోని జయతి గ్రామంలోని 11వ శతాబ్దం నాటి భ్రమరాంబికా సహిత మల్లిఖార్జునస్వామి ఆలయాన్ని కుమార్తె సిరిసహస్రతో కలిసి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేకపూజలు, అర్చనలు జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గేదెల సత్యం, వైస్ ఎంపీపీలు పొట్టంగి దుర్గ, ఈశ్వరరావు, నాయకులు వీరునాయుడు, లెంక రత్నాకర్‌నాయుడు, పి.అచ్చుత్, సతీష్, రెడ్డి రాజప్పలనాయుడు, దొగ్గ దేవుడు, లచ్చిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి ఉంచిన ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలుపై ఎంపీఓకు సూచనలు చేస్తున్న పీఓ కల్పనాకుమారి

భామిని: రైతులు పండించి అమ్మకానికి ఉంచి ధాన్యం మొత్తం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ఐటీడీఏ పీఓ కె.కల్పనా కుమారి తెలిపారు. భామిని మండలం ఘనసర ఆర్‌బీకేను బుధవారం సందర్శించారు. ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి సూచనలు చేశారు. గోనెల నాణ్యతాలోపం గుర్తించి కొత్త గోనెలు సరఫరా చేయాలని సూచించారు. గోనెల సేకరణ, ధాన్యం తరలింపు, లోడింగ్ వంటి అంశాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని ఎంపీఓ మన్మథరావును హెచ్చరించారు. ధాన్యం శాంపిల్స్ గుర్తించి పలు సూచనలు చేశారు. అనంతరం మణిగ, మనుమకొండ గ్రామాల్లో పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సిగ్నల్స్, ఇతర సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

చీపురుపల్లి: వాల్తేరు డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు రైల్వే డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ తెలిపారు. చీపురుపల్లి, గరివిడి రైల్వేస్టేషన్లను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫాంలు ఎత్తు, నూతన భవనాలు, వంతెనల నిర్మాణం తదితర పనులు చేపడతామని చెప్పారు.

పోలిపాడ్యమి పూజలు



తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని నాగావళినదీ తీరంలో దీపారాధన చేస్తున్న భక్తులు



పార్వతీపురంలోని అగ్రహారం శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు

కార్తీకమాసం పూర్తయిన వేళ.. పోలిపాడ్యమినాడు మహాలక్ష్మిని ఆహ్వానిస్తూ బుధవారం వేకువజాము నుంచి భక్తులు శైవ, వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నదీ తీరాలకు చేరుకుని దీపారాధనలు జరిపారు. అరటి తెప్పలపై దీపాలు వెలిగించి నదులు, పుష్కరిణిలలో విడిచిపెట్టారు. ఆరోగ్యభాగ్యం కలగాలని ప్రార్థించారు.

– గరుగుబిల్లి/పార్వతీపురంటౌన్

వైజ్ఞానిక ప్రదర్శనకు రంగం సిద్ధం

- ఈ నెల 15న మండల స్థాయి, 23న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ
- ప్రాజెక్టులు రూపొందించడంలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్:

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టే వైజ్ఞానిక ప్రదర్శనలకు జిల్లా విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రదర్శనలు నిర్వహించేందుకు చకచకా ఏర్పాట్లు పూర్తిచేసింది. బాలల సైన్స్‌కాంగ్రెస్, ఇన్‌స్పైర్ మనాక్, జాతీయ సైన్స్ దినోత్సవాల సందర్భంగా విద్యార్థుల్లో వైజ్ఞానిక విజ్ఞానం పెంచేందుకు ప్రభుత్వం ఏటా వైజ్ఞానిక పోటీలు నిర్వహిస్తోంది. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో భాగంగా పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 23న పార్వతీపురం డీవీఎంఎం ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ముందుగా ఈ నెల 15న మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో మండల స్థాయిలో ప్రదర్శనలు జరపనున్నారు.

పాల్గొనేందుకు అర్హులు వీరే..

ప్రతి పాఠశాల నుంచి గ్రూప్ విభాగంలో ఇద్దరు, వ్యక్తిగత విభాగం నుంచి ఒకరు, టీచర్ విభాగం నుంచి ఒక ఉపాధ్యాయుడు కింది అంశాల్లో తమ ప్రాజెక్టులు ప్రదర్శించవచ్చు. మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 8–10 తరగతుల మధ్య బోధన కొనసాగిస్తున్న విద్యార్థులు అర్హులు.

డీఈఓ ఉత్తర్వుల జారీ

పాఠశాల, మండల, జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలంటూ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో మండలం నుంచి ఒక్కో విభాగంలో ఒక్కొక్కటి వంతున మొత్తం మూడు ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 45 ప్రాజెక్టులు ఎంపిక చేస్తారు. అలాగే, 15 మండలాల నుంచి అటల్ ల్యాబ్స్ ఉన్న పాఠశాలల నుంచి రెండు ప్రాజెక్టుల చొప్పున నేరుగా జిల్లా స్థాయిలో ప్రదర్శలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసేందుకు డీఈఓ నేతృత్వంలో జిల్లా సైన్స్ అధికారి, ఉపాధ్యాయులు సంసిద్ధమవుతున్నారు. విద్యార్థుల చదువు, ఆటలే కాకుండా విభిన్న వైజ్ఞానిక అంశాల్లో ప్రతిభ చూపేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్నారు. గతంలో కేవలం జిల్లా స్థాయిలోనే విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేవారు. గత ఏడాది నుంచి ప్రభుత్వం పాఠశాల, మండల స్థాయిల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. నూతన ఆవిష్కరణలే ధ్యేయంగా విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.



విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు పాజెక్టులు సిద్ధం చేస్తున్న విద్యార్థులు

కేటగిరీలు ఇలా

విద్యా, వైజ్ఞానిక పోటీలను ప్రధానంగా భౌతిక శాస్త్రం (పీఎస్), రసాయనిక శాస్త్రం (కెమిస్ట్రీ), గణిత, ఖగోళ, పర్యావరణ, జీవశాస్త్రాలతో పాటు ఇంజినీరింగ్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అనే అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా గ్రూపుగా పోటీపడవచ్చు. ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కూడా పోటీల్లో పాల్గొనే అవకాశముంది. ఉపాధ్యాయ విభాగంలో పోటీ పడేవారు ఎనిమిది అంశాల్లో ఏదో ఒకటి ఎంచుకుని ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పాల్గొంటారు. వ్యక్తిగత విభాగంలో పోటీ పడే విద్యార్థులు ఎనిమిది అంశాల్లో ఏదో ఒకటి ఎంచుకుని గైడ్ టీచర్‌తో కలిసి పోటీ పడవచ్చు.



జిల్లాకు పేరుతెచ్చిన జోగింపేట కేజీబీవీ విద్యార్థులతో జిల్లా విద్యాశాఖాధికారులు (ఫైల్)

ప్రతిభ చూపాలి



వైజ్ఞానిక ప్రదర్శనల్లో పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపాలి. గత ఏడాది సీతానగరం మండలం జోగింపేట కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన 'భూగర్భ వ్యవసాయంపై ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావం' అనే ప్రదర్శన జిల్లాకు పేరుతెచ్చింది. విద్యార్థులను ప్రోత్సహించేలా ఏటా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. విద్యార్థుల్లోని అంతర్గతంగా దాగిన సృజనాత్మక ప్రతిభను వెలికి తీసేందుకు ఎంఈఓలు, హెచ్ఎంలు, సబ్జెక్టు టీచర్లు అంకితభావంతో పనిచేయాలి.

– ఎన్.ప్రేమ్‌కుమార్, డీఈఓ

ఉత్తమ ప్రదర్శనలు అందించేలా...



జిల్లా నుంచి ఉత్తమ ప్రదర్శనలు అందించేందుకు సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. తద్వారా జాతీయ స్థాయిలో మన జిల్లా విద్యార్థులు సత్తాచాటేలా సృజనాత్మకతను జోడించి విద్యార్థుల ఆలోచనలు ప్రతిబింబించేలా నూతన ప్రాజెక్టులను రూపొందించాలి. దీనికి ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, సంబంధిత ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.

– జి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- జేసీ ఆర్.గోవిందరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: ఓటరు జాబితాలో అభ్యంతరాలను ఈ నెల 26 నాటికి పరిష్కరిస్తామని జేసీ ఆర్.గోవిందరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి 1వ తేదీన ఓటరు జాబితాల ను ఫైనల్ చేసి జనవరి 5న తుది జాబితాను ప్రచురిస్తామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో ఫారం–6లు 42,219, ఫారం–7లు 43,214, ఫారం–8లు 97,250 వచ్చినట్టు వెల్లడించారు. ఎల క్ట్రానిక్ ఓటింగ్ మిషన్, వి.వి.పాట్ పనితీరు, ఓటువేసే విధానంపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటర్లందరూ ఈ కార్యక్రమంలో పా ల్గొనేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. డీఆర్వో జె.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,82,831 ఫారాలు స్వీకరించగా, వాటిలో 1,57,581 ఫారాలు పరిష్కరించి ఓటరు జాబితాలో చేర్చామన్నారు. అంతకు ముందు ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు జి.వెంకటనాయుడు, పి.రవికుమార్, పి.శ్రీనివాస్, టి.వెంకటరమణ, వి.చిన్నంనా యుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాక్సింగ్ పోటీలు



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఈశ్వర్‌కౌశిక్

విజయనగరం: విజయనగరం జిల్లా వేదికగా మూడు రోజులపాటు జరిగిన 65వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ స్కూల్‌గేమ్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన బాక్సింగ్ పోటీలకు 960 మంది క్రీడాకారులు అండర్–14, 17, 19 విభాగంలో ఐదు కేటగిరీలో జరిగిన పోటీల్లో 62 మంది క్రీడాకారులు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విజయనగరం జిల్లాలో ఏ క్రీడా పోటీలు నిర్వహించినా విజయవంతం చేసేందుకు తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. విజేతల్లో బాలికలు ఢిల్లీలో జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోను, బాలురు డిసెంబర్ 23 నుంచి మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్నారు. ముగింపు కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్.వి.రమణ, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.సూరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదిద్దాం



సారికలో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్న అంశాన్ని వివరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగేందుకు రానున్న ఎన్నికల్లో మరోసారి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిగా ఆశీర్వదిద్దామని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలం సారిక గ్రామంలో సర్పంచ్ గొర్లె సావిత్రి అధ్యక్షతన ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొన్నారు. సచివాలయ పరిధిలోని 535 కుటుంబాలకు నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.15 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ మేరకు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిగా ఎందుకు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ మహిళావిభాగం మండలాధ్యక్షురాలు బి.ప్రమీల, ప్రజాప్రతినిధులు, నాయకులు గొర్లె రాజారావు, పాస్టర్ సువార్తరావు, అమల, పీడిక సుదర్శనదొర, కొండపల్లి సింహాచలం, రామకృష్ణ, ఎన్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

టోఫెల్‌తో ప్రయోజనం



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీ

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న టోఫెల్ కార్యక్రమంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీ అన్నారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాజాం, సంతకవిటి మండలాల ఆంగ్ల ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను ఆయన బుధవారం పరిశీలించారు. అమెరికా దేశ ఆంగ్ల ఉచ్ఛారణ పరిజ్ఞానంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.నాగయ్య, రిసోర్స్ పర్సన్ ఆర్.భాస్కరరావు, బి.వి.అచ్యుత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలకు మంచి రోజులు

- స్వతంత్రత కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం
- సెట్విజ్‌లో విలీనాన్ని రద్దు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- డీఎస్‌డీఓలుగా వ్యవహరించనున్న చీఫ్ కోచ్‌లు
- అమల్లోకి వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు



రాజీవ్ ఇండోర్ స్టేడియంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయం

విజయనగరం: క్రీడా రంగానికి మంచి రోజులు వచ్చాయి. పూర్వ వైభవం కలగనుంది. సెట్విజ్‌లో విలీనం చేసిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థలకు స్వతంత్రత కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దాలుగా స్వతంత్రంగా ఉన్న క్రీడల విభాగాన్ని గత టీడీపీ ప్రభుత్వం 2018 సంవత్సరంలో సెట్విజ్‌లో విలీనం చేసిన విషయం తెలిసిందే. సంబంధం లేని శాఖలో విలీనం చేయడంతో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆధిపత్య పోరుతో గందరగోళ పరిస్థితులు తలెత్తేవి. ఈ నేపథ్యంలో క్రీడారంగాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. యువజన సర్వీసుల శాఖ (సెట్విజ్) నుంచి శాప్‌ను వేరుచేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నెల 1 నుంచి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్వతంత్ర కార్యకలాపాలను ప్రారంభించుకునేందుకు అనుమతించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాటు క్రీడాకారులు, క్రీడాభిమానులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

విలీనంతో తప్పని ఇబ్బందులు

స్వతంత్రంగా పనిచేస్తోన్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థలను సెట్విజ్‌లో విలీనం చేయడంతో క్రీడారంగంలో ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. అప్పటివరకు సంబంధిత విభాగానికి అధికారులుగా వ్యవహరించిన డీఎస్‌డీఓలను చీఫ్ కోచ్‌లుగా మార్పు చేసింది. డీఎస్‌డీఓలతో పాటు ఇతర ఉద్యోగులు, సిబ్బంది సెట్విజ్ సీఈఓల ఆధీనంలో విధులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. సెట్విజ్ సీఈఓలు, అప్పటి వరకు స్వతంత్ర్యంగా పనిచేసిన డీఎస్‌డీఓలు, కోచ్‌ల మధ్య విభేదాలు తలెత్తడంతో క్రీడా పోటీల నిర్వహణ, ఎంపికలు, సమావేశాలు నిర్వహణలో గందరగోళ పరిస్థితులు నెలకునేవి. అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలు, నిధుల మంజూరులో విబేధాలు పొడచూపడంతో పలువురు అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ప్రభుత్వం క్రీడారంగంలో నెలకొన్న సమస్యలను గుర్తించి మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సెట్విజ్ నుంచి శాప్ విలీనాన్ని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మరికొద్ది రోజుల్లో రాష్ట్రంలో నిర్వహించే అతిపెద్ద క్రీడా సంబరం ఆడుదాం–ఆంధ్రా పోటీల నిర్వహణ బాధ్యతను జిల్లా క్రీడాప్రాధికార సంస్థకు అప్పగించింది. జేసీ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇదే విషయమై జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుత్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి సెట్విజ్‌లో క్రీడాప్రాధికార సంస్థ విలీనాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై కోచ్‌లు, ఇతర సిబ్బంది డీఎస్ఏ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తారని పేర్కొంది. జిల్లా క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సైనిక పాఠశాలలో క్రీడా సంబరం

- క్రీడా పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ శాస్త్రి

విజయనగరం రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి సైనిక పాఠశాల కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి అన్నారు. కోరుకొండ సైనిక పాఠశాల 61వ వార్షిక అథ్లెటిక్ మీట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల పరిధిలోని విద్యార్థులకు సీనియర్, జూనియర్లగా విభజించి అథ్లెటిక్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సైనిక పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాఠశాలకు, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఈ నెల 22న వార్షికోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు క్రీడల్లో తలపడి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి

క్లుప్తంగా

రమణ మహర్షి సూక్తులు అనుసరణీయం


రమణ మహర్షి ఆశ్రమంలో శివలింగాభిషేకం చేస్తున్న రుద్రాక్షస్వామి

బొబ్బిలి: భగవాన్ రమణ వాశిష్ట మహాముని సూక్తులు అనుసరణీయమని అరుణాచల రుద్రాక్షస్వామీజీ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కలువరాయిలో ఉన్న రమణ మహర్షి వాశిష్ట గణపతి మహాముని ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ఆశ్రమంలో శివలింగాభిషేకం చేశారు. కార్యక్రమంలో సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని నాలుగు ఆవుల మృతి

సీతంపేట: మండలంలోని కె.గుమ్మడ సమీపంలో పశువుల మందను లారీ ఢీకొన్న సంఘటనలో నాలుగు ఆవులు అక్కడికక్కడే దుర్మరణం చెందాయి. మరో రెండు ఆవులు, ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి నివగాం నుంచి సీతంపేట వైపు పశువులను రహదారిపై ఓ వ్యక్తి తోలుకుని వస్తుండగా మార్గ మధ్యంలో కె.గుమ్మడ సమీపానికి వచ్చేసరికి పాలకొండ నుంచి కొత్తూరు వెళ్తున్న లారీ పశువుల మందను ఢీకొట్టింది. దీంతో జరిగిన ప్రమాదంలో మందలోని నాలుగు ఆవులు మృతిచెందగా మరో రెండు ఆవులకు గాయాలయ్యాయి. పశువులను తోలుకుని వస్తున్న హంసకదుమకు చెందిన కె.వీరయ్యకు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సీతంపేట: మండలంలోని దోనుబాయి జంక్షన్ సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న పది లీటర్ల సారాను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్‌నాయుడు తెలిపారు. ఈ కేసులో పాలకొండకు చెందిన శేషపు రామినాయుడిని అరెస్టు చేశామని చెప్పారు.

పోలీసుల అదుపులో ఆవుల లారీ

పూసపాటిరేగ: ఆవుల లోడుతో వెళ్తున్న లారీని పూసపాటిరేగ మండలంలోని సీహెచ్ అగ్రహారం జంక్షన్‌లో జాతీయరహదారిపై ఎస్సై జి. బాలకృష్ణ బుధవారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్రీకాకుళం నుంచి విశాఖవైపు 54 ఆవుల లోడుతో వెళ్తున్న భారీ లారీని అదుపులోకి తీసుకుని బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మహేశ్వరరావు (ఫైల్)

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని కొత్తవలస గ్రామానికి చెందిన యువకుడు కొరికాన మహేశ్వరరావు (24) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. ఈ విషయమై ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహేశ్వరరావు కడుపు నొప్పి తాళలేక ఈ నెల 7న గడ్డి మందు తాగేసి వాంతులు చేసుకుంటుండగా తండ్రి లక్ష్మీనారాయణ గమనించి వెంటనే రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించాడు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. ఈ మేరకు రిమ్స్‌లో చికిత్స పొందుతూ 12న రాత్రి మృతిచెందినట్లు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పాకలు, గడ్డివాములు దగ్ధం


కాలిపోతున్న పశువుల పాకలు, గడ్డివాములు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేటలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాకలు, నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని దుర్గాలమ్మ గుడివద్ద ఉన్న కళ్లాల్లో రాత్రి 9 గంటల సమయంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో కండిపల్లి దేముడు, కండిపల్లి అప్పలరాజు, గొర్లె అప్పారావులకు సంబంధించిన నాలుగు గడ్డి వాములు, రెండు పశువుల పాకలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో ఒక పెయ్యి చనిపోయి, మరో పెయ్యి కాలిపోయి కొన ఊపిరితో ఉంది. మరో రెండు గేదెల ఆచూకీ తెలియరాలేదు. సమాచారం మేరకు ఎస్.కోట అగ్నిమాపక వాహనం గ్రామానికి చేరుకున్నప్పటికీ ప్రమాదస్థలానికి చేరుకోవడానికి దారి లేకపోవడంతో స్థానికులు మంటలు అదుపుచేయడంలో నిమగ్నమయ్యారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సుమారు రూ.మూడు లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

బతుకు భరోసా..

- మహిళలు, యువత సాధికారతకు ఉపాధి మార్గం
- వ్యాపారాలకు సర్కారు సహకారం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక తోడ్పాటుతో సత్ఫలితాలు


ఇట్లామామిడిపల్లిలో పీఎంఈజీపీ ద్వారా డైరీఫారం ఏర్పాటు చేసుకున్న జంగం రాము

రామభద్రపురం: మహిళలు, యువత సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ బతుకుపై ఆశలు కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీనిధి బ్యాంకు రుణాలతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. స్వయం ఉపాధి సాధించడంతో పాటు మరి కొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారు.


బట్టల వ్యాపారం ద్వారా జీవనోపాధి పొందుతున్న శారద

పీఎంఈజీపీ ఓ వరం

కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఉపాధి పథకం) అన్ని వర్గాల నిరుద్యోగ యువతకు వరంలా మారింది. బ్యాంకుల సహకారంతో ఇస్తున్న ఈ రుణాలతో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు చూస్తున్నారు. ఈ పథకంలో ఒక్కో యూనిట్ రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఇస్తున్న రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు యువత పెద్ద ఎత్తున ముందు వస్తున్నారు.ఈ పథకంలో 35 శాతం రాయితీతో కుట్టు మెషీన్లు, ఫ్యాషన్ టెక్నాలజీ, హోటళ్లు, ఇంటర్నెట్, డీటీపీసెంటర్, ఫొటో స్టూడియో, కార్లు, మినీ వ్యాన్లు పొందేందుకు బ్యాంకు సహకారం తీసుకుని రుణాలు పొందవచ్చు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో పీఎంఈజీపీ పథకం కింద యువతీ యువకులు 290 యూనిట్లకు గాను రూ.6.69 కోట్ల రుణాలు పొందారు. అలాగే పీఎంఎంఈ పథకం కింద రూ.1.26కోట్లతో 52 యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎంఈజీపీ కింద ఇప్పటి వరకు రూ.8.81 కోట్లతో 349 యూనిట్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు.ఇంకా 318 యూనిట్లు బ్యాంకు మంజూరు చేసి ఉండగా మరో 360 యూనిట్లు మంజూరు చేయాల్సి ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఇప్పటి వరకు రూ.1.17 కోట్లతో 41 యూనిట్లు ఏర్పాటు చేశారు. మరో 8 యూనిట్లు బ్యాంకు యాజమాన్యాలు మంజూరు చేయగా గ్రౌండింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో 30 యూనిట్లు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయి.


ఇట్లా మామిడిపల్లిలో కుట్టు మెషీన్ ఏర్పాటు చేసుకున్న లక్ష్మి


రాభమద్రపురంలో పాన్‌షాపు ఏర్పాటు చేసుకున్న చప్ప భవాని


కొట్టక్కిలో వైఎస్సార్ ఆసరాతో చిరువ్యాపారం చేసుకుంటున్న ఉప్పల పద్మావతి

మహిళా సాధికారతకు ప్రభుత్వం చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మహిళలకు మార్గం చూపుతోంది. మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలకు ఆర్థిక సహకారం అందజేస్తోంది. స్త్రీనిధి బ్యాంకు రుణాలతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.జిల్లాలో నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 31,070 మహిళాసంఘాలలో 3,50,108 మంది మహిళా సభ్యులు రూ.854.45 కోట్లు పొందారు.16,979 మహిళా సంఘాలకు రూ.118.26 కోట్లు స్త్రీనిధి రుణాలు పంపిణీ చేశారు.సున్నా వడ్డీ కింద 38,125 మహిళా సంఘాలలో 4,31,856 మంది మహిళా సభ్యులకు రూ.119.82 కోట్లు వారి ఖాతాలలో జమ చేశారు. వైఎస్సార్ చేయూత కింద 14,347 మంది మహిళలకు రూ.734.27 కోట్లు అందజేశారు.అలాగే జగనన్న తోడు పథకం కింద 86.214 స్వయం సహాయక సంఘాలకు రూ.87.29 కోట్లు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సహకారంతో మహిళలు అప్పడాలు, వడియాలు, పచ్చళ్లు, కిరాణా షాపులు, కుట్టు మెషీన్లు, స్వీట్ షాపులు, పిండి మిల్లులు, చిన్న చిన్న బట్టల వ్యాపారాలు పెట్టుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

మహిళలు, యువత సాధికారతే ప్రభుత్వాల ధ్యేయం



మహిళలు, యువత సాధికారతే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. మహిళలు, యువత ఆర్థిభివృద్ధికి సహకారం అందిస్తున్నాయి. వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వాల ఆలోచన. పీఎంఈజీపీలో నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకుంటే బ్యాంకుల సహకారంతో 35 రాయితో రుణాలు మంజూరు చేస్తున్నాం. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని పిలుపునిస్తున్నాం.

– ఎ కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ, విజయనగరం

నేతన్నకు ప్రభుత్వం ఊతం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు
- వర్క్‌షెడ్లు, మర మగ్గాలు, సోలార్ లైట్లు పంపిణీ
- బొబ్బిలి క్లస్టర్‌కు రూ.1.8కోట్లు విడుదల


పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో దగాపడిన చేనేత కార్మికులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని పక్కి గ్రామంలో చేనేత కార్మికులకు వర్క్ షెడ్లు, మరమగ్గాలు, సోలార్‌లైట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చేనేత పరికరాలను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులను అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఫ్రేమ్‌మగ్గాలు, సోలార్ లైట్లు,వర్క్‌షెడ్ల యూనిట్లకు సబ్సిడీ అందజేస్తున్నట్లు చెప్పారు. బొబ్బిలి చేనేత క్లస్టర్‌లోని 172 మందికి రూ.కోటీ 6లక్షల19వేలను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఇందులో మొదటి విడతగా పరికరాలు, సబ్సిడీని విడుదల చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన చేనేత రంగాన్ని తమ ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న చేనేత జౌళి శాఖ ఎ.డి ఆర్‌వీ మురళీకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి చేనేత క్లస్టర్ పరిధిలో రూ.17వేల విలువ చేసే ఫ్రేమ్‌మగ్గం, 64 యూనిట్ల సోలార్ లైటింగ్ సిస్టమ్‌లు, రూ.20 లక్షల విలువ చేసే వర్క్ షెడ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.లబ్ధిదారులు వాటిని స్వయంగా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.వసంత సాయి, నెడ్‌క్యాప్ సిబ్బంది అజయ్, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్. శాంతకుమారి, సర్పంచ్ గంట పైడిరాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మామిడి సేకరణ కేంద్రం ప్రారంభం


మామిడిపంటసేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించిన మామిడి సేకరణ కేంద్రాన్ని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 60 శాతం మంది రైతులు మామిడి పంటసాగుచేసి జీవిస్తున్నారన్నారు. ఈ కేంద్రాన్ని మండలంలోని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డివేణుగోపాల్‌రావు, కోట్లవిశ్వేశ్వరరావు, బూర్లెనరేష్‌కుమార్, స్థానిక ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఎ.వి.ఎస్.వి.జమదగ్ని, చీపురుపల్లి నియోజకవర్గ ఉద్యానవనశాఖాధికారి సీహెచ్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయుల ప్రతిభ


గెలుపొందిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: ఈనెల 8 నుంచి 10వరకు తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఐటీడీఏ డీడీ కార్యాలయంలో గెలుపొందిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు 16 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, 6 రజత పతకాలను ఉపాధ్యాయులు సాధించారని చెప్పారు. వీపీ భాస్కరరావు (గంగమ్మపేట), ఆర్. గౌరీశ్వరి (లంకాజోడు), పి. చంద్రమోహన్, ఎ. అరుణ (మెండెంఖల్), జనార్దన (సామరిల్లి), ఎన్.ధర్మారావు, ఎ.సన్యాసిరావు (ధర్మలక్ష్మీపురం), ఎ.సూర్యకళ (కె.డి కాలనీ), ఎ.అరుణశ్రీ (లంకా జోడు)లు పాఠశాలల నుంచి తిరుపతిలో జరిగిన క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

హాకీ పోటీలకు అండర్-19 జట్లు పయనం


హాకీ పోటీలకు వెళ్తున్న జిల్లా అండర్-19 జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–19 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల హాకీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు బుధవారం పయనమయ్యాయి. ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి బాల, బాలికల జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. పోటీలకు బయలుదేరిన క్రీడాకారులకు అండర్–19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయిలో జరగనున్న పోటీలకు అర్హత సాధించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాల, బాలికల జట్ల కోచ్ అండ్ మేనేజర్‌లతో పాటు పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల నిర్వహణకు రూ. లక్ష సహాయం


ఎ.నారాయణరావుకు నియామకపత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో అండర్–14, 17, 19 విభాగాల్లో జరగనున్న 67వ అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీల నిర్వహణకు జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులకు బుధవారం అందజేశారు.

నైట్ వాచ్‌మెన్‌కు నియామక పత్రం

డెంకాడ మండలంలోని పెదతాడివాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వికలాంగుల విభాగంలో ఎ.నారాయణరావును నైట్ వాచ్‌మెన్‌గా నియమిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం తన కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


విద్యాశాఖ అధికారులకు రూ. లక్ష చెక్కును అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భక్తులతో తోటపల్లి కిటకిట

- అర్ధరాత్రి నుంచే తాకిడి
- నాగావళిలో విడిచిపెట్టిన దీపాలు


నాగావళినది తీరంలో స్వామివారికి హారతినిస్తున్న ఆలయ చైర్మన్ సత్యన్నారాయణ


భక్తులతో సందడిగా ఉన్న నాగావళి నది తీరం

గరుగుబిల్లి: 'పోలిపాడ్యమి' సందర్భంగా 'ఓం నమః శివాయ..హరహర మహదేవ శంభో శంకర' 'ఏడు కొండలవాడ వేంకట రమణ..గోవిందా...గోవిందా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో తోటపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం హోరెత్తింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి భక్తులు సమీపంలోని నాగావళినది తీరానికి చేరుకుని, బుధవారం ఉదయం వరకు కార్తీకమాసంలో నెలరోజుల పాటు చేసిన కార్తీకమాస పూజలకు నదీతీరంలో వీడ్కోలు చెబుతూ మార్గశిర శుద్ధ పాడ్యమినాడు మహాలక్ష్మిని ఆహ్వానిస్తూ తెప్పల్లో దీపాలను పెట్టి నదిలో విడిచిపెట్టారు. అనంతరం స్వామివారికి తిరువీధి నిర్వహించి, భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. పార్వతీపురం, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస తదితర మండలాలతోపాటు రాజాం, వీరఘట్టం, పార్వతీపురం ప్రాంతాలనుంచి సుమారు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు వీవీ. అప్పలాచార్యులు మాట్లాడుతూ మార్గశిరశుద్ధ పాడ్యమినాడు జీవనదుల్లో స్నానంచేసి స్వామివారిని దర్శించుకుంటే, కోటి సూర్యగ్రహణాల స్నానం ఆచరించిన ఫలితం వస్తుందని పురాణాలలో పేర్కొన్నట్లు చెప్పారు. పాలకొండ డీఎస్పీ అజీజ్ పర్యవేక్షణలో చినమేరంగి స్టేషన్‌హౌస్ ఆఫీసర్ కళాధర్ ఆధ్వర్యంలో భక్తులను క్యూలో ఉంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మద్రాపు సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసాదాలతోపాటు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


స్వామివారికి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు


స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


ప్రసాదాలను వితరణ చేస్తున్న సిబ్బంది